
ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కరువు

- ఇసుక అందక నత్తనడకన మోడల్ హౌస్ పనులు
- లబ్ధిదారుల ఇళ్లదీ ఇదే తీరు
- ఇంకా ముగ్గు పోసిన దశలోనే నిర్మాణాలు
- ఒక్కో ఇంటికి 40 టన్నులు అవసరం 8

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో

కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠలో నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి ప్రజలపై అమ్మవారి కటాక్షం ఉండాలని పూజలు చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రజలపై అమ్మవారి కటాక్షం ఉండాలని పూజలు చేసిన టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని చెరువు కట్టపై గంగపుత్ర సంఘం-సంగారెడ్డి వారి ఆధ్వర్యంలో బుధవారం కట్ట మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొని పూజలు చేశారు. అమ్మ వారి కృపా కటాక్షాలు సంగారెడ్డి పట్టణ ప్రజలపై ఉండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో తోపాజీ అనంతకిషన్, కూన సంతోష్, కిరణ్ గౌడ్, ప్రదీప్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కూన సత్తయ్య, ప్రధాన కార్యదర్శి కిషన్, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నగేష్, కార్యదర్శి చిదంబర్ సాయి, గంగపుత్ర సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



హోమం చేస్తున్న వేదపండితులు



రంగనాయకసాగర్‌లోకి గోదావరి జలాలు



చిన్నకోడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో గోదావరి జలాలు పరవళ్లు తొక్కా యి. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగమైన సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల సరిహద్దులో 3.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన అనంతగిరి (అన్నపూర్ణ) రిజర్వాయర్ నుంచి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి బుధవారం ఒక పంపు ద్వారా నీటి ఎత్తిపోతను నీటి పారుదలశాఖ అధికారులు ప్రారంభించారు. రంగనాయకసాగర్ రిజర్వాయర్ సామర్థ్యం 03 టీఎంసీలు కాగా ఇప్పటికే రిజర్వాయర్‌లో 1.38 టీఎంసీల నీరు నిల్వ ఉందని, నాలుగు రోజుల్లో 01 టీఎంసీ నీటిని రిజర్వాయర్‌లోకి ఎత్తిపోయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

తొలిరోజు 95% హాజరు



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

- ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం
- పలు పరీక్షా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, సీపీ

సిద్దిపేట క్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా 43 పరీక్ష కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సర సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు 10,542 విద్యార్థులకు 9976 మంది హాజరయ్యారు. 95 శాతం హాజరు నమోదైంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో అంధ విద్యార్థి అహ్మద్ పరీక్షను ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి రేఖ రాసింది.



సిద్దిపేటలోని ఓ సెంటర్‌లో హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు

కలెక్టర్, సీపీ తనిఖీలు

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రగతి జూనియర్ కాలేజ్, న్యూ జనరేషన్ జూనియర్ కాలేజ్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలను కలెక్టర్ ఎం. మనుచౌదరి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో వసతులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే అంధ, దివ్యాంగులు ప్రత్యేక సహాయకుల ద్వారా పరీక్ష రాసేందుకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు సూచించారు. ఎండలు అధికంగా ఉన్నందున ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద చల్లని తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ రెడ్డి ఉన్నారు.

ఎన్సాన్‌పల్లి తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, సిద్దిపేట బాయ్స్ ప్రభుత్వ జూనియర్ కళాశాల తదితర పరీక్ష కేంద్రాలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు సిబ్బందికి పటిష్టమైన బందోబస్తు గురించి తగు సూచనలు సలహాలు చేశారు.



ఎన్సాన్‌పల్లిలో అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ



సిద్దిపేట ప్రభుత్వ బాలికల కళాశాల పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్


సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- పంటను పరిశీలించిన వ్యవసాయాధికారులు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

గజ్వేల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 3న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వరి రైతులపై మొగి పిడుగు కథనానికి గజ్వేల్ మండల వ్యవసాయాధికారులు స్పందించారు. మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామంలోని రైతు తలారి వెంకటేశ్, షెట్టి పోచయ్య పొలాలను పరిశీలించారు. వరిలో మొగిపురుగు, సల్ఫైడ్ తీవ్రతతో పాటు అగ్గితెగులు, కాండం తొలిచే పురుగు ఉధృతి ఉందని గుర్తించారు. ఈ సందర్భంగా గజ్వేల్ మండల వ్యవసాయాధికారి గుండు నాగరాజు మాట్లాడుతూ అగ్గి తెగులు సోకిన వరి ఆకులపై కండె ఆకారంలో ఎర్రటి మచ్చ ఏర్పడి క్రమంగా ముదురు గోధుమ రంగులోకి మారి ఆకులు ఎండిపోతాయన్నారు. మొగిపురుగు ఉధృతి అంతగా లేదని, ఒకే పొలంలో పంట మార్పిడి లేకుండా ఒకే పంటను సాగు చేయడం వలన సల్ఫైడ్ ఉధృతి వస్తుందని తెలిపారు. అంతేకాకుండా అక్కడక్కడా కాండం తొలిచే పురుగును గుర్తించినట్లు తెలిపారు. ఆయా పురుగులు, తెగుళ్ల సమస్య నుంచి బయటపడేందుకు సస్యరక్షణ చర్యలను చేపట్టాలని సూచించారు. అగ్గితెగులు నివారణకు యూరియా వాడకాన్ని తాత్కాలికంగా ఆపివేయాలని వెంటనే ట్రైసైక్లోజెన్ మందును 0.6గ్రాములు లేదా కాసుగామైసిన్ మందును 1.5 మిల్లీలీటర్లు లేదా ఐసోప్రో తయోలిన్ 1.5 మిల్లీలీటర్ల చొప్పున లీటరు నీటికి కలిపి రెండు సార్లు పిచికారి చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు స్థానిక వ్యవసాయా విస్తరణ అధికారులకు సమాచారం అందించాలని తగు సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు.



గజ్వేల్ మండలం పిడిచెడ్‌లో వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి నాగరాజు



రంగనాయకసాగర్ రిజర్వాయర్ సమీపంలోని పొలాల మధ్యలో ఇటుకబట్టీలు

బట్టీలకూ భరోసా!

- నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలు
- వ్యాపారం చేసే భూములకు రైతుభరోసా
- నాలా కన్వర్షన్ చేయకుండానే బట్టీల నిర్వహణ
- ఏళ్ల తరబడిగా లక్షలాది రూపాయలు దుర్వినియోగం
- ఇటుక బట్టీలకు ఉచిత విద్యుత్ వాడకం
- అధికారులు, నేతల అండదండలతో ఇష్టారాజ్యం
- వందల ఎకరాలకు సర్కారు సొమ్ము ధారాదత్తం

"దుబ్బాక మండలంలో ఇటుకబట్టీలు ఉన్న భూములకు గతంలో రైతుబంధు డబ్బులు పడ్డాయి. ప్రస్తుతం 2 ఎకరాల లోపు వాళ్లకు మాత్రమే రైతు భరోసా డబ్బులు జమ చేశారు. ఇక్కడ ఇటుక బట్టీలు నడుస్తున్న భూముల విస్తీర్ణం 5 ఎకరాల దాకా ఉంది. ఉచితంగా వ్యవసాయ విద్యుత్‌ను సైతం వాడుతున్నారు."

"మద్దూరు మండలంలో నిర్వహిస్తున్న పలు ఇటుకబట్టీలకు ఎలాంటి అనుమతి లేదు. ఆంధ్రాకు చెందిన ఓ వ్యక్తి వీటిని నిర్వహిస్తున్నాడు. పక్కనే ఉన్న చెరువులో నుండి మట్టిని తరలించి ఇటుకలు తయారు చేస్తున్నారు. భూమి యజమానులకు రైతు భరోసా డబ్బులు సైతం పడుతున్నాయి."

"సిద్దిపేట రూరల్ మండలంలోని గ్రామాల్లో వ్యవసాయ భూముల్లోనే ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. ఈ భూములకు సంబంధించి ఏటా రైతుబంధు డబ్బులు పడ్డాయి. 3 నుంచి 4 ఎకరాల విస్తీర్ణం కావడంతో ఇంకా రైతుభరోసా సాయం అందలేదు. ఈ బట్టీలకు సంబంధించి అధికారుల వద్ద ఎలాంటి రికార్డులు లేవు."

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి,
సిద్దిపేట, మార్చి5

జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇటుకబట్టీలలో చాలా వరకు నిబంధనలు అతిక్రమిస్తున్నారు. బట్టీలు నిర్వహించాలంటే ముందుగా వ్యవసాయ భూమిని వాణిజ్య భూమిగా మార్చుకోవాలి. నాలా కన్వర్షన్ ద్వారా రెవెన్యూ అధికారులతో ప్రత్యేక పత్రాలు పొందాలి. అదే విధంగా ఆయా గ్రామాల కార్యదర్శులతో ఎన్‌వోసీ ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. కానీ ఇవేవి లేకుండానే ఇష్టారాజ్యంగా ఇటుకబట్టీలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు మెండుగా వినిపిస్తున్నాయి.

వ్యవసాయ భూముల జాబితాలోనే..

గత ప్రభుత్వ హయాంలో చెట్టుకు, పుట్టకు, గుట్టలకు రైతుబంధు డబ్బులు అందాయి. అందులో ఇటుకబట్టీలు కూడా ఉన్నాయి. అయితే ఈ ప్రభుత్వం వచ్చాక వాణిజ్యపరమైన భూములు, వ్యవసాయానికి యోగ్యం కాని భూములను ప్రత్యేకంగా గుర్తించారు. ఇలాంటి భూములకు రైతుభరోసా సహాయాన్ని కట్ చేస్తామని చెప్పారు. కానీ వ్యవసాయ భూముల్లోనే కొనసాగుతున్న ఇటుక బట్టీలకు చాలావరకు రైతు భరోసా సహాయం అం దినట్లుగా తెలుస్తున్నది. ఒక సర్వే నంబరులోనే పంటలతోపాటు ఇటుకబట్టీలు కూడా ఉండటంతో అంతటికీ రైతు భరోసా సహాయం దక్కుతున్నది. వ్యవసాయ, రెవెన్యూ అధి కారులు ఇటీవల క్షేత్రస్థాయిలో సర్వే చేశామని చెబుతున్నప్పటికీ అందులో ఇటుక బట్టీలు ఉన్న భూములను తొలగించనట్లుగా అర్థమవుతోంది.

ఇటుకబట్టీలకూ ఉచిత విద్యుత్..

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తున్న విషయం తెలిసిందే. వ్యవసాయ భూముల్లోనే

మిగతా 8వ పేజీలో



మద్దూరు మండలంలో పొలాల నడుమ ఇటుకబట్టీలు



స్మైల్ ప్లీజ్..

- దంతాల సంరక్షణతోనే సంపూర్ణ ఆరోగ్యం
- నిర్లక్ష్యం వహిస్తే చిగుళ్లు, దంతాల సమస్యలు
- మూడు నెలలకోసారి పరీక్ష చేయించుకోవాలి
- నేడు జాతీయ దంత వైద్యుల దినోత్సవం 7

సర్వేను అడ్డుకున్న చిన్నగుండవెల్లి రైతులు

- భూమికి బదులుగా భూమి...లేదా మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్
- సర్వేను తాత్కాలికంగా వాయిదా వేసిన అధికారులు

సిద్దిపేట రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి); ఇప్పటికే మల్లన్నసాగర్ ప్రాజెక్టు అండర్ గ్రౌండ్ టన్నెల్, ఓపెన్ కెనాల్ పేరుతో భూములు లాక్కుంటున్నారు. మళ్లీ జాతీయ రహదారి 365బి సర్వే పేరుతో భూములు లాక్కుని మా బతుకులు ఛిద్రం చేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ చిన్నగుండవెల్లి రైతులు సర్వే పనులను అడ్డుకున్నారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లిలో ఎన్‌హెచ్-365బి రోడ్డు సర్వేకు రెవెన్యూ అధికారులు పోలీసు బలగాలతో గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. జాతీయ రహదారి సర్వే అంటూ తమ గ్రామానికి అధికారులు రావొద్దని, ఎన్‌హెచ్-365బి రోడ్డు ప్లానింగ్‌లో సర్వం తప్పుల తడకగా ఉందని రైతులు మండిపడ్డారు. రోడ్డు మ్యాపింగ్ విషయమై కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లే వరకు గ్రామంలో సర్వేలు నిలిపి వేయాలని తహసీల్దార్ వెంకటరెడ్డికి విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారి నిర్మాణంతో తమ గ్రామానికి ఎలాంటి ప్రయోజనం లేదని వారు ఆరోపించారు. ఏ జాతీయ రహదారికి లేని జిగ్‌జాగ్‌లు ఒక్క ఎన్‌హెచ్-365బికి మాత్రమే ఉన్నాయని మండిపడ్డారు. పలుకుబడి ఉండి, రాజకీయ అండదండలు ఉన్న వారి భూములను అధికారులు ముట్టుకోవడం లేదని, సామాన్య రైతుల భూములు లాక్కుంటూ మా జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఒక న్యాయం.. మాకు ఒక న్యాయమా అంటూ తహసీల్దార్‌ను ప్రశ్నించారు. ఎన్‌హెచ్365బి రోడ్డుతో సిరిసిల్లా.. వేములవాడ వెళ్లే వారికి అదనంగా 20 కిలోమీటర్ల దూరం పెరుగుతుందని ఇదేం సర్వే అని అధికారులను నిలదీశారు. ఇది వరకు ఉన్న రోడ్డులతోనే జాతీయ రహదారిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ భూములనే లాక్కుంటాం అంటే భూమికి బదులుగా భూమి ఇవ్వాలని లేదా మార్కెట్ విలువకు అనుగుణంగా పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు విన్న తహసీల్దార్ వెంకటరెడ్డి వాటిని ఉన్నతాధికారులకు విన్నవిస్తానని, ప్రస్తుతానికి సర్వేను నాలుగురోజుల పాటు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు పరిధిలో 5కిలోమీటర్లు, చిన్నగుండవెల్లి పరిధిలో 2.5కిలోమీటర్ల సర్వే పూర్తయిందని, ఇంకా 1.2 కిలోమీటర్ల సర్వే చేయాల్సి ఉందని తెలిపారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.



విలేకరులకు తమ సమస్యలను వివరిస్తున్న చిన్నగుండవెల్లి రైతులు

మంత్రి క్యాంపు కార్యాలయంలో

జాబ్‌మేళా

హుస్నాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన చేసిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఇండిగో విమాన యాన సంస్థలో డ్రైవర్లు, లోడర్ల ఉద్యోగాల కోసం ఏజీఐఎల్‌ఈ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూలకు 129 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఇందులో హెవీ మోటర్ వెహికిల్ డ్రైవర్లుగా 60 మంది, లైట్ మోటర్ వెహికిల్ డ్రైవర్లుగా 25 మంది, లోడర్లు 43 మంది, టెక్నిషియన్‌గా ఒకరు ఎంపికయ్యారు.



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

వికసిత్ భారత్ యువ పార్లమెంట్ నోడల్ జిల్లాగా మెదక్

- పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈనెల 9వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు గడువు
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్

మెదక్ అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ యువ పార్లమెంట్ నోడల్ జిల్లాగా మెదక్ ఎంపికైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.హుస్సేన్ తెలిపారు. బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. భారత్ యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో దేశ యువత ఆలోచన విధానాలపై పాలసీ పొందుపర్చి ప్రపంచంలోనే దేశాన్ని శక్తివంతమైన భారత్‌గా మార్చడానికి యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారన్నారు. మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలకు నోడల్ కళాశాలగా మెదక్ డిగ్రీ కాలేజ్‌ను ఎంపిక చేశారని తెలిపారు. 18 నుంచి 25 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు యూత్ పార్లమెంట్ పోటీలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మొదటగా మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 'నా దృష్టిలో వికసిత్ భారత్ అంటే ఏంటి' అంశంపైన ఒక్క నిమిషం నిడివి కలిగిన వీడియో చేసి ఈ నెల 9వ తేదీలోగా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. స్క్రీనింగ్ చేసి జిల్లాస్థాయిలో ఎంపిక చేస్తారని, ఆయా జిల్లాల నుంచి ఎంపికైన వారికి మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇందులో 10 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారని వివరించారు. యూత్ పార్లమెంట్ పోటీలపై యువతకు అవగాహన కల్పించి, ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. మిగతా వివరాలకు 9885077541, 9985372264, 9912787070 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డాక్టర్ గదరాజు చందును అభినందించిన మాజీ సీఎం కేసీఆర్



మాజీ సీఎం కేసీఆర్‌కు గ్రంథాన్ని అందజేస్తున్న డాక్టర్ గదరాజు చందు

చేర్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం కడవేరుగు గ్రామానికి చెందిన డాక్టర్ గదరాజు చందును బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అభినందించారు. గదరాజు చందు ఇటీవల ప్రొఫెసర్ ఎం.గోనానాయక్ పర్యవేక్షణలో రాష్ట్రంలో దొమ్మర కులస్థుల సంస్కృతి, సాహిత్య పరిశీలన అంశంపై పరిశోధన పూర్తిచేసి, ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. సంబంధిత సిద్ధాంత తొలి గ్రంథాన్ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి చందు అందజేశారు. సాహిత్య పరిశోధన విషయాలను కేసీఆర్‌కు వివరించారు. అనంతరం కేసీఆర్ స్పందిస్తూ తెలంగాణ ఆది హిందూ జాతికులాల సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ తెలంగాణ బిడ్డపై ఉందని, గ్రామీణ ప్రాంత బిడ్డగా అరుదైన పరిశోధన జరపడం పట్ల చందును అభినందించారు. ఆయనతో పాటు కేసీఆర్‌ను కలిసిన వారిలో రాళ్లబండి చందు, బొంగురం జితేందర్ రెడ్డి దాసరి అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రైలు నుంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

మాసాయిపేట, మార్చి5 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని ప్రయాణికుడు మృతిచెందిన సంఘటన బుధవారం మాసాయిపేట రైల్వేస్టేషన్ వద్ద చోటుచేసుకున్నది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 60 ఏళ్ల వయస్సున్న వ్యక్తి బుధవారం ఉదయం మాసాయిపేట రైల్వేస్టేషన్ వద్ద రైలులో నుంచి కిందపడి మృతిచెందాడు. స్టేషన్‌మాస్టర్ ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కామారెడ్డి రైల్వే ఆసుపత్రికి తరలించామని రైల్వే పోలీసు ఇన్‌చార్జి స్టేషన్ అధికారి రవికుమార్ తెలిపారు.

క్రైం కార్నర్

జహీరాబాద్‌లో చెడ్డీగ్యాంగ్ కలకలం

భయాందోళనలో పట్టణ ప్రజలు



జహీరాబాద్‌లో ఓ అపార్ట్‌మెంట్ వద్ద చెడ్డీగ్యాంగ్

జహీరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో చెడ్డీగ్యాంగ్ దొంగల అలజడి కలకలం రేపుతున్నది. మంగళవారం తెల్లవారుజామున ముసుగులు ధరించి చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. ఈ గ్యాంగ్ పట్టణంలోని సాయినగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో పలు అపార్ట్‌మెంట్‌ల వద్ద తిరగడం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. స్థానికులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణం విస్తరించిన నేపథ్యంలో ఈ గ్యాంగు ఎక్కడెక్కడ తిరుగుతారో తెలియని పరిస్థితి నెలకొన్నదని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వెంటనే సమాచారం ఇచ్చి సహకరించాలని పోలీసులు కోరుతున్నారు. పట్టణంలో పెట్రోలింగ్ వాహనాలను పెంచడంతో పాటు, పోలీసులందరినీ అలర్ట్ చేశామని, చెడ్డీగ్యాంగ్‌ను పట్టుకునే పనిలో ఉన్నామని ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. ప్రజలు ఆందోళన చెందొద్దని భరోసా కల్పించారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో కొత్త వ్యక్తులు తిరిగితే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

చేపల వేటకు వెళ్లి.. చెరువులో పడి మృతి



కడారి లింగం(ఫైల్)

చిన్నకోడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువు నీటిలో పడి మృతిచెందిన సంఘటన చిన్నకోడూరు మండలం ఎల్లమ్మజాలులో బుధవారం జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చౌడారం గ్రామానికి చెందిన కడారి లింగం (55) సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం సెంట్రింగ్ పని లేకపోవడంతో లింగం చేపలు పట్టుకు వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయిన లింగం ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టూ పక్కల వెతికారు. తెలిసిన వారిని అడిగినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం లింగం భార్య పద్మ కుమారుడితో కలిసి భర్త ఆచూకీ కోసం వెతుకుతూ ఎల్లమ్మజాలు వైపు వెళ్తుండగా గ్రామ శివారులోని చెరువు సమీపంలో రోడ్డుపై లింగం టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనం, చెరువు నీటి ఒడ్డున చెప్పులు కనిపించాయి. స్థానికుల సాయంతో నీటి దగ్గరికి వెళ్లే సరికి చేపలు పట్టడానికి వేసే వైరుతాడు (గాళం) కన్పించింది. తాడును పైకిలాగి చూసేసరికి దానికి చిక్కుకుని లింగం మృతదేహం పైకి తేలింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లింగం భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య



లంబాడి శ్రీను(ఫైల్)

కౌడిపల్లి, మార్చి (ఆంధ్రజ్యోతి) 5 : చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని వసురాం తండాలో మంగళవారం రాత్రి జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. వసురాంతండాకు చెందిన లంబాడి శ్రీను(32) కొంతకాలంగా పని చేయకుండా మద్యం తాగుతూ తిరుగుతున్నాడు. పని చేయకుండా ఉండటంతో ముగ్గురు ఆడపిల్లలు ఉన్నా పట్టించుకోకపోతే ఎలా అని కుటుంబసభ్యులు శ్రీనును నిలదీశారు. తీరు మార్చుకోవాలని సూచించారు. దీంతో మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన శ్రీను కన్నారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీను భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మృతికి తమ్ముడే కారణమని అక్క ఫిర్యాదు

తూప్రాన్ మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : గత నెల తల్లి మృతిచెందగా, తమ్ముడిపై అనుమానంతో అక్క పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన తూప్రాన్ పరిధిలో బుధవారం చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మున్సిపాలిటీ పరిధి గుండ్రెడ్డిపల్లి గ్రామంలోని చింతల పోచమ్మ(74), బాలనర్సయ్య దంపతులకు కూతురు నాగరాణి, కుమారుడు రాజు ఉన్నారు. ఇద్దరికి వివాహమైంది. 16 నెలల క్రితం తండ్రి బాలనర్సయ్య ఆరోగ్యం బాగాలేక చనిపోయారు. తల్లి ఇంటి వద్దనే ఉంటుంది. మూడు సంవత్సరాల క్రితం కుమారుడు రాజుకి పెళ్లి కావడంతో అప్పటి నుంచి భార్యతో కలసి రాజు మేడ్చెల్ జిల్లా సూరారం పట్టణంలో ఉంటున్నారు. గుండ్రెడ్డిపల్లిలోని ఇంటి వద్ద తల్లి పోచమ్మ ఒక్కరే ఉంటున్నారు. గత నెల 21న కుమారుడు రాజు గుండ్రెడ్డిపల్లికి వచ్చాడు. అక్క నాగరాణికి ఫోన్‌చేసి అమ్మకు దమ్ము రావడం లేదని, ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎమ్ ఆసుపత్రికి తరలిస్తున్నామని తెలిపారు. ఆసుపత్రికి తీసుకెళుతుండగా, మార్గమధ్యంలోనే పోచమ్మ మృతిచెందింది. స్థానికులు రాజుపై అనుమానం వ్యక్తం చేయగా అక్క నాగరాణి దృష్టికి వెళ్లింది. ఆమె తమ్ముడు రాజుపై తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో వర్క్‌లోడ్ పెంచాలి

- లేకుంటే కార్మికులకు నష్టమే
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు వినతి



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఓడీఎఫ్ ఉద్యోగులు

కంది, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో వర్క్‌లోడ్ పెంచాలని, లేకుంటే కార్మికులు తీవ్రంగా నష్టపోతారని కంది మండల పరిధిలోని ఓడీఎఫ్ (ఆర్డినెన్స్ డిఫెన్స్ ఫ్యాక్టరీ) ఉద్యోగులు బుధవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతపత్రం అందజేశారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకులంగా స్పందిచారని, త్వరలోనే ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో వర్క్‌లోడ్ విషయమై రక్షణ మంత్రిత్వ శాఖ దృష్టి తీసకుకెళ్తానని తెలిపారని ఓడీఎఫ్ జేఏసీ నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్య, ప్రభు, బాలనర్సయ్య, వెంకటరెడ్డి, పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీదే అధికారం

- జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి

చేగుంట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలో వస్తుందని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌కు వెళ్తున్న గంగారెడ్డిని బీజేపీ నార్సింగి నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి నిదర్శనం ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలు బీజేపీ కైవసం చేసుకోవడమేనన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శర్మ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్మైల్ ప్లీజ్..



దంతాల సంరక్షణతోనే సంపూర్ణ ఆరోగ్యం
నిర్లక్ష్యం వహిస్తే చిగుళ్లు, దంతాల సమస్యలు
మూడు నెలలకోసారి పరీక్ష చేయించుకోవాలి
అందుబాటులో అత్యాధునిక చికిత్స

సిద్దిపేట టౌన్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): పేదాలపై పూచే చిరునవ్వు మనిషికే అందాన్ని తీసుకొవస్తుంది. చిరునవ్వు చిందిస్తూ ఎదుటివారిని ఆకర్షించవచ్చు. ఈ చిరునవ్వులో కనిపించే దంతాలతోనే ఆ అందమంతా దాగి ఉంటుంది. దంతాలు ఆరోగ్యంగా ఉంటేనే పదిమందిలోనూ సంతోషంగా నవ్వగలుగుతారు. అలాంటి దంతాల సంరక్షణ ఎంతో ముఖ్యమైనది. శరీరంలో ఇతర ఆరోగ్య సమస్యల మాదిరిగానే దంత సమస్యలు సాధారణ నుంచి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. దీంతో పంటినొప్పితో పాటు చిగుళ్ల సమస్యలు, వాపులు రావడం, రక్తస్రావం జరిగి ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపిస్తుంది. అందుకే దంతాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే భారీ మూల్యం తప్పదని దంత వైద్యులు హెచ్చరిస్తున్నారు. శరీరంలోని భాగాలపై చూపిస్తున్న శ్రద్ధతో పాటు దంతాల సంరక్షణ తప్పనిసరి అని సూచిస్తున్నారు. నేడు జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..



పంటినొప్పి వస్తే భరించడం కష్టతరం

శరీరంలోని పలు భాగాల్లో ఏ నొప్పి వచ్చినా కొంతమేరకు తట్టుకోగలిగినా, పంటి నొప్పి వస్తే మాత్రం తట్టుకోవడం చాలా కష్టతరం. సాధారణంగా తీసుకునే ఆహారం, చిరుతిళ్లు, చల్లని పానీయాలు, ఎక్కువగా తీపి పదార్థాలు క్రమంగా తీసుకోవడం ద్వారా దంతాలపై ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఇదే క్రమంలో సరైన, నాణ్యమైన, మంచి ఆహారం తీసుకోకపోవడం, ప్రతీ రోజు చాకెట్లు తినడం ద్వారా కూడా దంతాలు పుచ్చిపోయి తీవ్రమైన నొప్పికి దారి తీస్తాయి. దంతాలు నొప్పి వస్తున్నప్పుడు వెంటనే వైద్యుడిని సంప్రదిస్తే మొదట్లోనే ఆ సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలున్నాయి. నిర్లక్ష్యం వహిస్తే దంతాలు పూర్తి స్థాయిలో పుచ్చిపోయే అవకాశముండటంతో పాటు పన్ను పీకేయాల్సిన పరిస్థితి వస్తుంది.

దంతాలను కాపాడుకోవాలి..



ప్రతీరోజు ఆహారం తీసుకుంటాం కాబట్టి దంతాలను, ఎప్పటికప్పుడు నోరును శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. ఉదయం లేవగానే, రాత్రి పడుకునే ముందు తప్పనిసరిగా బ్రష్ చేయడంతో పాటు వీలైతే మౌత్ వాష్ చేసుకోవాలి. దంతాలకు సంబంధించి సమస్య వస్తే ఇతరుల మాట వినకుండా, సొంత వైద్యం చేసుకోకుండా దంత వైద్యుడిని సంప్రదించాలి. మారుతున్న కాలానుసారంగా ఎన్నో అత్యాధునిక పరికరాలతో దంతాలకు చికిత్స చేసి సంరక్షించుకోవచ్చు. అవసరమైతే తప్ప పన్నును తొలగించకుండా రూట్‌కెనాల్ ట్రీట్‌మెంట్ ద్వారా దంతాలను కాపాడుకోవచ్చు.

-డాక్టర్ అరవింద్‌కుమార్, దంత వైద్య నిపుణులు, సిద్దిపేట

నిర్లక్ష్యం వహిస్తే ..

నాణ్యత లేని ఆహారం తినడం మూలాన ఆ ప్రభావం ఆరోగ్యంపై కనబరుస్తున్నది. తినే ఆహారంలో పంటికి అంటుకుపోయే ఆహారపదార్థాలు ఉంటాయి. ఇలాంటి సమయాల్లో దంతాలను శుభ్రపరుచుకోకుంటే చిగుళ్ల సమస్యలు అధికంగా వస్తాయని దంతవైద్యులు హెచ్చరిస్తున్నారు. దీంతో క్రమేణా దంతాల మధ్యలో సందులు ఎర్పడి, ఆహారం ఇరుక్కపోయి పుచ్చిపోవడంతో పాటు చిగుళ్ల వాపు, రక్తస్రావమయ్యే అవకాశముంది. తద్వారా నోటి నుంచి దుర్వాసన ప్రారంభమవుతుంది. దంత వైద్యుడిని సంప్రదించకుండా నిర్లక్ష్యం చేస్తే సమస్యలు పెరిగి క్రినిక్ జనరైజల్ జింజివైటీస్‌కు దారితీస్తాయని వైద్యులు చెప్పారు. సీజీజీ సోకితే దంతాలకు సంబంధించిన ఎముకలకు బ్యాక్టీరియా చేరి చిగుళ్లు పాడైపోతాయని తెలిపారు.

అత్యాధునిక పరికరాలతో చికిత్స

పంటినొప్పికి సంబంధించి చికిత్సకు అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఎత్తు, వంకర, విరిగినవి, మొదటి దశలో పుచ్చిపోతున్న దంతాలను రూట్ కెనాల్, దంతాల ఎక్స్‌రేతో పాటు పలు ట్రీట్‌మెంట్‌లకు అత్యాధునిక పరికరాల ద్వారా చికిత్స అందించి సంరక్షించుకోవచ్చు. దంతాల్లో ఎర్పడిన రంధ్రాలను శుభ్రపరిచి దానిలో సిమెంట్, సిల్వర్, గ్లాస్ ఐనోమర్ లాంటి వాటితో ఫిల్లింగ్ చేసే సదుపాయాలున్నాయి. కొందరు సమయానికి వైద్యుడి వద్దకు వెళ్లకుండా నొప్పి ఉన్న చోట జాండుబామ్ పెట్టుకుంటే మోహమంతా వాచిపోతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

దంత సంరక్షణ కోసం పాటించాల్సినవి

- ఉదయం, రాత్రి వేళల్లో రెండుసార్లు తప్పనిసరిగా బ్రష్ చేయాలి
- మెత్తని బ్రష్‌ను, వైద్యుడు రాసిచ్చిన టూత్ పేస్ట్‌ను వాడాలి
- పిల్లలకు దంతాలకు అతుక్కపోయే చాక్లెట్లకు దూరంగా ఉండాలి
- ధూమపానం, మద్యపానం, చెడుతినుడులకు దూరంగా ఉండాలి
- నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలి
- ప్రతీ రోజు మౌత్‌వాష్‌ను వాడటం ద్వారా బ్యాక్టీరియా చనిపోతుంది
- దంతాలను గట్టిగా కొరకడం వంటికి దూరంగా ఉండాలి
- చిగుళ్లు, దంతాల సమస్య ఉంటే వెంటనే దంత వైద్యుడిని సంప్రదించాలి
- ప్రతీ మూడు నెలలకొకసారి దంత వైద్యుడి దగ్గరికి వెళ్లి పరిరక్షించుకోవాలి

ఎస్సారెస్పీలో నీళ్లు తగ్గినా.. రెండు పంటలకు నీళ్లిచ్చాం

- మేడిగడ్డ బ్యారేజ్‌లో ఒక పిల్లర్ మాత్రమే కుంగింది
- బీఆర్ఎస్ మీద బురదజల్లి రాజకీయంగా లబ్ధి పొందారు
- మా మీద కోపంతో రైతులకు అన్యాయం చేయొద్దు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



నీటి ఎత్తిపోతను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

చిన్నకోడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్సారెస్పీలో నీరు తగ్గినా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసి ఒక్క ఎకరా ఎండకుండా రెండు పంటలకు నీళ్ల ఇచ్చామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన మంచి పనులను తుడిచిపెట్టాలనో, ఆ పనులను పక్కకు పెట్టాలనే ప్రయత్నంతో ప్రభుత్వం ప్రజలకు నష్టం చేయవద్దన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్‌లు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంప్‌హౌస్‌లు, 203 కిలోమీటర్ల టన్నెల్, 1,531 కి.మీ.ల గ్రావిటీ కెనాల్, 98 కి.మీ. ప్రెజర్ మెన్ పైప్‌లైన్, 530 మీటర్ల ఎత్తు లిఫ్ట్, 141 టీఎంసీల రిజర్వాయర్‌ల సామర్థ్యం.. వీటన్నింటి సమాహారమన్నారు. అన్ని బాగున్నాయని ఒక్క మేడిగడ్డ బ్యారేజ్‌లో 1 బ్లాక్‌లో ఒక పిల్లర్ మాత్రమే కుంగిందని తెలిపారు. దీనికి మొత్తం కాళేశ్వరం కొట్టుకుపోయిందని, మునిగిపోయిందని గోరంత దాన్ని కొండంత చేసి దుష్ప్రచారం చేసి, బీఆర్ఎస్ మీద బురదజల్లి రాజకీయంగా లబ్ధి పొందారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అయిందని, ఆ కుంగిన పిల్లర్‌ను మరమ్మతు చేయడానికి ఈ సమయం సరిపోదా అని ప్రశ్నించారు. పిల్లర్‌ను మరమ్మతు చేస్తే లక్షల ఎకరాల పంటలు కాపాడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం గుడ్డి వ్యతిరేకతతో మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ మీద కోపంతో రైతులకు అన్యాయం చేయవద్దని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఒక్క ఎకరా కూడా పారలేదని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని పారే నీళ్లు కాళేశ్వరానికి కాదా..పండే పంట కాళేశ్వరం పంట కాదా అని ఆయన ప్రశ్నించారు. మల్లన్నసాగర్ ,కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్, అనంతగిరి రిజర్వాయర్ కింద పండే పంటలు కాళేశ్వరం ఫలితం కాదా అన్నారు. రైతులతో పాటు, మత్స్యకారులకు టన్నుల కొద్దీ చేపల ఉత్పత్తి జరుగుతుందని అందరికీ మేలు జరిగే కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని అన్నారు. హైదరాబాద్‌కు తాగునీరైనా, మూసీలోకి స్వచ్ఛమైన గోదావరి జలాలు ప్రవహించాలన్నా అన్నింటికి కాళేశ్వరమే ముఖ్యమైనదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద సిద్దిపేట నియోజకవర్గంలో 50 వేల ఎకరాల్లో వరి పంట సాగవుతుందన్నారు. పంట పొట్ట దశలోకి వచ్చేసరికి రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో నీటి లభ్యత తగ్గిందన్నారు. ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసి పంటలను కాపాడాలని లేఖ ద్వారా ప్రభుత్వాన్ని కోరామని, లేఖపై స్పందించి అనంతగిరి రిజర్వాయర్ నుంచి 1 టీఎంసీ నీటిని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేస్తున్నందుకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు సదానందం, కనకరాజు, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, బీఆర్ఎస్ నాయకులు కొండం రవీందర్‌రెడ్డి, ఉమేష్ చంద్ర, శ్రీనివాస్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రెండు షాపులు సీజ్

- ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోని యాజమాన్యాలు

జోగిపేట, మార్చి5 (ఆంధ్రజ్యోతి): అందోలు-జోగిపేట మున్సిపల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టణంలోని రెండు షాపులను సీజ్ చేశారు. మున్సిపల్ పరిధిలో వ్యాపారాలు నిర్వహిస్తున్న ఓ మోటార్స్, మరో ఆటోమొబైల్స్ షోరూం యాజమాన్యాలు ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోలేదు. సంవత్సరం కాలంగా పలుమార్లు నోటీసులు పంపామని పట్టించుకోలేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు రెండు షాపులను సీజ్ చేశామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, వృత్తి వ్యాపార లైసెన్స్‌లను తీసుకోవాలని, లేని పక్షంలో కలెక్టర్ ఆదేశాల మేరకు సీజ్ చేస్తామని వినయ్ హెచ్చరించారు. మున్సిపల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శ్రీధర్, ఖయాముద్దీన్, జవాన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి

- న్యాయాధికారి రమేష్

సంగారెడ్డి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. సంగారెడ్డిలోని బాలసదనం, శిశుగృహ, సఖీ కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు అందరూ క్రమశిక్షణతో నడుచుకోవాలని సూచించారు. పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించాలని, ఏవైనా న్యాయపరమైన సహాయం కోసం సంస్థ కార్యాలయంలో సంప్రదిస్తే ఉచితంగా న్యాయసహాయం అందిస్తామన్నారు.

గీతంలో 'గస్టో' పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షబ్బీర్‌అలీ

పటాన్‌చెరు రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో 'గస్టో-2025' పేరిట నిర్వహిస్తున్న మూడురోజుల అంతర్ విశ్వవిద్యాలయ వార్షిక క్రీడా పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత, భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ షబ్బీర్‌అలీ జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు.

గజేంద్ర ఆశ్రమంలో హరినామ సప్తాహ

కల్హేర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఏడు రోజుల పాటు నిర్వహించే అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. సిర్గాపూర్ మండల పరిధిలోని అంతర్గాం గజేంద్ర ఆశ్రమంలో పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతీమహరాజ్ ఆధ్వర్యంలో రుక్మిణీ విఠలేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సంత్ తుకోభరాయ్ చిత్రపటానికి పూలమాలవేశారు. ఈ కార్యక్రమంలో అంతర్గామ మాజీ సర్పంచ్‌లు రవిపటేల్, విఠల్‌రావ్, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

వచ్చే విద్యాసంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో ఏఐ బోధన

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్


మాసాయిపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరం నుంచి మెదక్ జిల్లాలోని అన్ని పాఠశాలలలో ఏఐ విద్యను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మాసాయిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని ఏఐ సెంటర్‌ను సందర్శించగా, అదే సమయంలో కరెంట్ సరఫరా కట్ కావడంతో 15 నిమిషాలు నిరీక్షించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న పశువుల ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం పాఠశాలకు చేరుకుని ఏఐ సెంటర్‌ను, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యుత్ ఏఈ మనోహర్‌ను కరెంట్ కోతలపై అడిగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యాసంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ఆరు ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్(ఏఐ)పై శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన ఆరు పాఠశాలలలో ఆయా ఉపాధ్యాయులకు సైతం ప్రత్యేక శిక్షణను అందించినట్లు తెలిపారు. ఏఐ శిక్షణతో విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసి భవిష్యత్‌లో మంచి ఫలితాలను పొందవచ్చని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. వచ్చే తరంలో ఏఐ అన్ని రంగాల్లో కీలకంగా మారనుందని, విద్యార్థులు చిన్ననాటి నుంచే ఏఐలో నిష్ణాతులు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో విఘ్నేశ్వర్, తహసీల్దార్ జ్ఞాజ్యోతి, ఆర్ఐ ధన్‌సింగ్, ప్రధానోపాధ్యాయులు బాలమణి, ధర్మపురి తదితరులు ఉన్నారు.

ఏఐ టెక్నాలజీతో ఉపయోగం

నిజాంపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఏఐ టెక్నాలజీతో విద్యార్థులకు ఎంతో ఉపయోగమని డీఈవో రాధాకిషన్ అన్నారు. నిజాంపేటలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించి కంప్యూటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విద్యార్థుల మేధస్సుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం పాఠశాల హాజరు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో సొంగని యాదగిరి ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించండి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం 1,36,821 మందిని అర్హులుగా గుర్తించామని, మంజూరైన ఇళ్లను వెంటనే మార్కింగ్ చేసి ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని గ్రామపంచాయతీల్లో ఎల్‌ఆర్‌ఎస్ డబ్బు బ్యాలెన్స్ త్వరగా వసూలు చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చలివేంద్రాలు, పశువుల నీటి తొట్టెలను ఏర్పాటు చేసి తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రత్యేకాధికారులు గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో ప్రతీనెల తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాలన్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు సిబ్బందితో సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. గ్రామాల్లో కనీసం 60 మంది కొత్తవారికి ఉపాధి పని కల్పించాలన్నారు.

25 శాతం రాయితీతో లేఅవుట్ల క్రమబద్ధీకరణ

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకునే వారికి 25 శాతం రాయితీ లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణలో అనుమానాలు, ఇబ్బందులు ఎదురైతే సంబంధిత మున్సిపల్ కార్యాలయాల్లోని హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలన్నారు. జిల్లాలోని అర్హులైన వారందరూ గడువులోగా తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. జిల్లాలోని 12 మున్సిపాలిటీల అధికారులు బిల్ కలెక్టర్లతో ప్రతీరోజు రివ్యూ నిర్వహించి ఇంటి పన్ను, నల్లా బిల్లులు వందశాతం వసూలు చేయాలన్నారు. లక్ష్యాన్ని పూర్తిచేయని మున్సిపల్ సిబ్బందికి మెమోలు జారీ చేయక తప్పదని హెచ్చరించారు. కొత్తగా ఏర్పాటైన నాలుగు మున్సిపాలిటీల్లో జీపీల నుంచి అసెస్మెంట్‌కు సంబంధించిన రికార్డులన్నీ స్వాధీనం చేసుకోవాలన్నారు. హెచ్ఎండీఏ పరిధి చెరువులు, కుంటల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతంచేయాలని కలెక్టర్ క్రాంతి ఆదేశించారు.సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీపీవో సాయిబాబ, హౌజింగ్ పీడీ చలపతిరావు, అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కరువు

- ఇసుక అందక నత్తనడకన మోడల్ హౌజ్ పనులు
- లబ్ధిదారుల ఇళ్లదీ ఇదే తీరు
- ఇంకా ముగ్గు దశలోనే నిర్మాణాలు



మద్దూరులో నత్తనడకన సాగుతున్న ఇందిరమ్మ మోడల్‌హౌజ్ పనులు

మద్దూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లకు ఆదిలోనే ఇసుక కష్టాలు ఆరంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 26 మండలాల్లోని మండల కేంద్రాల్లో ఇందిరమ్మ మోడల్ హౌజ్ నిర్మాణాలకు హౌజింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసి పనుల్ని ప్రారంభించారు. అలాగే మద్దూరు మండలంలోని ధర్మారం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 100 మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. వీటన్నింటికీ ఇసుక కష్టాలు మొదలవడంతో ఇంకా ముగ్గు పోసిన దశలోనే ఉన్నాయి.

ఒక్కో ఇంటికి 40 టన్నుల వరకు..

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితంగా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. అమలులో ఆచరణకు నోచుకోవడం లేదు. ఈ విషయమై లబ్ధిదారులు అధికారులను సంప్రదించినా ఇంకా మార్గదర్శకాలు రాలేదని చెబుతూ కాలయాపన చేస్తున్నారు. సొంతంగా తెచ్చుకుందామన్నా అధికారులు అనుమతులివ్వని పరిస్థితి దాపురించింది. దీంతో మండల కేంద్రాల్లో నిర్మిస్తున్న మోడల్ హౌజ్ నిర్మాణానికే ఇసుక కరువైంది. ఇక లబ్ధిదారుల ఇళ్లకు ఎలా అందిస్తారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి 37 నుంచి 40 టన్నుల ఇసుక అవసరం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఎంతో అట్టహాసంగా మండల కేంద్రాల్లో ఫిబ్రవరి 11న గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ముగ్గు పోసి నెల రోజుల్లో ఇంటి నిర్మాణం చేపట్టి లబ్ధిదారులకు నమూనా చూపించేందుకు నిర్ణయించారు. వీటికి కంకర, బెండడి, సలాఖ అందించినా ఇసుకను అందించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఈ క్రమంలో మోడల్ హౌజ్ పనులు నత్తనడక కొనసాగుతున్నాయి. మరోవైపు పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన అక్రమ ఇసుకను రెవెన్యూ అధికారులకు అప్పగించగా, అనుమతులు లేకుండానే హౌజింగ్ సిబ్బంది వినియోగిస్తుండడం గమనార్హం.

లబ్ధిదారులకూ అందని ఇసుక..

మండలంలోని ధర్మారం 100 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేశారు. అంతేకాకుండా హౌజింగ్ అధికారుల ఆదేశాల మేరకు స్థానిక పంచాయతీ సెక్రటరీలు లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలకు ముగ్గు పోయించారు. ఈ ఇళ్లకు కూడా ఇసుక అందని ద్రాక్షగా మారింది. మద్దూరు మండలం నుంచి విడిపోయిన దూళిమిట్ట మండలంలోనే ఇసుక వాగులున్నాయి. నిత్యం అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రెవెన్యూ అధికారులకు వస్తేనే ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక అందే పరిస్థితులున్నాయి.

ఆరుగురికి జరిమానా

సిద్దిపేట క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కొన్ని రోజులుగా సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో, రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో ఆరుగురు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని బుధవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ చేసి ఆరుగురికి రూ.12,500 జరిమానా విధించారు.

ఆర్థిక సాయం అందజేత

ములుగు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తానెదార్‌పల్లి గ్రామానికి చెందిన జామకాయల కనకయ్య ఇటీవల మృతిచెందాడు. ఆయనకు భార్య పుణ్యవతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పుణ్యవతికి అనారోగ్యంతో మంచానికే పరిమితమవడంతో భర్తనే సేవలు చేసేవాడు. ఇటీవల ఆయన మరణించడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. దీంతో శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ సభ్యులు ఆ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు విష్ణుజగతి, ప్రధాన కార్యదర్శి మల్లేశం, కోశాధికారి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఎండిన పంటలను పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

సాగునీరు వదలకపోతే రాజీవ్ రహదారిని దిగ్బంధిస్తాం

- తమ ప్రాంతాలకు తరలిస్తున్న మంత్రులు
- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తపాస్‌పల్లి రిజర్వాయర్ డి4 కాల్వ నుంచి కొండపాక మండలానికి మూడు రోజుల్లో సాగునీరు వదలకపోతే రాజీవ్ రహదారిని దిగ్బంధం చేస్తామని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం కొండపాక మండలంలోని దమ్మకపల్లిలో ఎండిపోయిన పంటలు, బోసిపోయిన నీటి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నీటిని ఇక్కడి ప్రాంతవాసులకు ఇవ్వకుండా మంత్రులు తమ జిల్లాలకు మళ్లిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలానికి చుక్క నీరు రాలేదన్నారు. వెంటనే నీటిని విడుదల చేయాలని, లేనిచో రైతులతో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు ర్యాగల దుర్గయ్య, నూనె కుమార్, అనంతల ప్రశాంత్, రాధాకిషన్‌రెడ్డి, రాజిరెడ్డి , సంజీవరెడ్డి, రవీందర్ , సురేందర్ రెడ్డి, అహ్మద్, గోనె శ్రీనివాస్, కోడెల మల్లేశం తదితరులు ఉన్నారు.

కొండపోచమ్మసాగర్‌లోకి నీళ్లు వదలాలి

- ఎంపీ రఘునందన్‌రావుకు రైతుల వినతి



మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మర్కుక్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ రిజర్వాయర్‌లోకి నీటిని వదిలేలా చూడాలని మండలంలోని చేబర్తి, అంగడికిష్టాపూర్, శ్రీగిరిపల్లి, మర్కుక్ గ్రామాల రైతులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కోరారు. ఈ మేరకు బుధవారం మండల బీజేపీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రామ్‌రెడ్డి, మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలువపై ఆధారపడి 300 ఎకరాల వరకు రైతులు పంటలు సాగు చేశారని, ఇప్పటికే పెట్టుబడులు పెట్టి నీటి కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. కోనాపూర్ పంప్‌హౌజ్ నుంచి కొండపోచమ్మ రిజర్వాయర్‌కి వెళ్లే పెద్ద కాలువలోకి నీటిని విడుదల చేసేలా కృషి చేయాలని కోరారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

గజ్వేల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వేడి వేడి ఆహారాన్ని అందజేయాలన్నారు. మెనూ ప్రకారం ఆహారం ఇవ్వాలన్నారు. ఆమె వెంట మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, గజ్వేల్ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, గజ్వేల్ మండల వ్యవసాయాధికారి వైకృష్ణ ఉన్నారు.

నానో యూరియాపై రైతులకు అవగాహన



మంతూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయపోల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా, డీఏపీ వినియోగంతో పెట్టుబడి ఖర్చు తగ్గడంతోపాటు అధిక దిగుబడులు వస్తాయని ఇఫ్కో జిల్లా మార్కెటింగ్ మేనేజర్ చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రాయపోల్ మండలం మంతూరులో రైతులకు అవగాహన కల్పించారు. భూమిలో యూరియా, డీఏపీ వేస్తే అవి పూర్తి స్థాయిలో పంటలకు అందదని తెలిపారు. నానో యూరియా, డీఏపీలను పంటపై పిచికారీ చేస్తే ఆకుల నేరుగా అందుతుందన్నారు. కార్యక్రమంలో ఇఫ్కో ప్రతినిధులు జీడిపల్లి రాంరెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి'



మాట్లాడుతున్న చేర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రణీత

చేర్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, చెడువ్యసనాలకు అలవాటుపడకుండా అప్రమత్తతో వ్యవహరించాలని చేర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రణీత అన్నారు. చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం స్థానిక డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాల, నేతాజీ డిగ్రీ కళాశాల విద్యార్థులకు నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో లైంగిక వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్‌వైకే ప్రతినిధులు కిరణ్‌కుమార్, ఎం.రంజిత్‌రెడ్డి మాట్లా డుతూ యువత, విద్యార్థులు సన్మార్గంలో పయనించాలని, లైగింక వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

' ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి '



సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద ఆటోలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సిద్దిపేట క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ సూచించారు. బుధవారం ఆయన సిద్దిపేట పట్టణం ఓల్డ్ బస్టాండ్ వద్ద ఆటోలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని 20 ఆటోలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. రోడ్డుకు అడ్డదిడ్డంగా కాకుండా పార్కింగ్ స్థలంలో ఆటోలను పార్కు చేయాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్నెస్ తదితర పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. కెపాసిటీకి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోవద్దని తెలిపారు.కార్యక్రమంలో సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.


'పది' పరీక్షలకు సర్వం సిద్ధం : ఎంఈవో

దౌల్తాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగరాజుపల్లి ఎంజేపీ బాలుర, మండల కేంద్రంలోని బాలికల జడ్పీ పాఠశాల్లో పదవతరగతి పరీక్ష కేంద్రాల ఏర్పాటు దృష్ట్యా బుధవారం ఎంఈవో గజ్జల కనకరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఈ నెల 21 నుంచి జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మొత్తం 453 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎం జె పి బాలుర పాఠశాల ప్రిన్సిపల్ స్వప్న, సిఆర్పి రాజు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

- సిద్దిపేట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

రాయపోల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక సమాజంలో జీవితాలు సైన్స్‌తోనే ముడిపడి ఉన్నాయని, ప్రతి ఒక్కరూ సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాయపోల్ మండలం బేగంపేట ఉన్నత పాఠశాలలో జరిగిన జాతీయ సైన్స్ ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నేడు సైన్స్ లేకుండా ఏ పని చేయడం సాధ్యంగాని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. సైన్స్‌ను మంచికోసం వాడుకుంటే మంచి జరుగుతుందని, చెడు కోసం వాడితే ఇబ్బందులు ఏర్పడతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణరెడ్డి, హెచ్‌ఎం అంజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాయపోల్ : మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

- కొండపాక, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : సైన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని కొండపాక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సముద్రాల శ్రీనివాస్, తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయులడు ప్రసన్నమని అన్నారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన 75 సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. అలాగే విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సైన్స్ ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, మాధవి మాట్లాడుతూ నిత్యజీవితంలో సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజశ్రీ, యాదగిరి పాల్గొన్నారు.



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను సందర్శించిన భువనగిరి ఎంపీ

చేర్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా దేవాదుల అధికారులతో మాట్లాడి రిజర్వాయర్ సామర్థ్యం, నీటి పంపింగ్, లిఫ్టింగ్, కెనాల్, ఆయకట్టు, రిజర్వాయర్ పరిధిలోని గ్రామాలు, నియోజకవర్గాలు, జిల్లాల పరిధిలోని గ్రామాలు, తదితర వివరాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం చేర్యాల మండలం కమలాయపల్లి గ్రామశివారులోని తపాస్‌పల్లి రిజర్వాయర్ డీ-3 కాలువతో పాటు సమీపంలోనే ఉన్న సిద్దిపేట నియోజకవర్గంలోని రంగనాయకసాగర్ ఎల్‌డీ-10కాలువను పరిశీలించారు. రంగనాయకసాగర్ ఎల్‌డీ-10 కాలువ, తపాస్‌పల్లి డీ3 కాలువ మధ్యన తూము ఏర్పాటు విషయంతో పాటు దేవాదులద్వారా తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటి పంపింగ్ విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు నీటిపారుదలశాఖ అధికారులతో సంప్రదించనున్నట్లు హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీలు కొమ్ము నర్సింగరావు, గిరి కొండల్‌రెడ్డి, నాయకులు నాగపురి కిరణ్‌కుమార్, కాటం మల్లేశం, బండి శ్రీనివాస్, కూకట్ల బాలరాజు తదితరులు ఉన్నారు.



సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్నపెద్దమ్మ తల్లి ఉత్సావాల్లో బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. -సిద్దిపేట రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి)

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

నంగునూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు దేవులపల్లి రాజమౌళి, చిట్యాల కనకయ్య కోరారు. ఈ మేరకు బుధవారం నంగునూరు ఎంపీడీవో లక్ష్మప్పకు వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం మార్చి 7 నుంచి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు పిల్లి రవీందర్, కార్యదర్శి బిల్లం బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు



నంగునూరులోని పరీక్షా కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

ఇంటర్ పరీక్షలు షురూ

జిల్లాలో బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు మొదలయ్యాయి. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకోగా సిబ్బంది తనిఖీలు చేసి లోపలికి అనుమతించారు.



హుస్నాబాద్ పరీక్షా కేంద్రం వద్ద...



సిద్దిపేటలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

గోదావరి జలాలను అందించాలంటూ ధర్నా



తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపి సాగు నీరందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కొమురవెల్లి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడుతూ పంటలు ఎండిపోతుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపకపోవడంతో చెరువులు, కుంటలలో నీరులేక భూగర్భ జలాల నీటిమట్టం అడుగంటిపోయిందన్నారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.50వేలు పరిహారం అందించాలన్నారు. ఈ విషయమై దేవాదుల అధికారులు ఫోన్‌లో మాట్లాడి త్వరలో నీటిని రిజర్వాయర్‌లోకి విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తాడూరి రవీందర్, నాయకులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, బాలకిషన్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

చేర్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్ఎస్‌కు 1996-97బ్యాచ్ పదవతరగతి విద్యార్థులు బుధవారం కలర్ ప్రింటర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఐలయ్యకు పూర్వవిద్యార్థులను అభినందించారు.

'విద్యార్థి దశలో క్రమశిక్షణ ముఖ్యం'

సిద్దిపేట అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని సిద్దిపేట త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాలు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సోషల్ మీడియా, సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు మన తప్పిదాల వల్లే జరుగుతున్నాయన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఓటీపీలు అడిగితే చెప్పవద్దని, అలాగే సోషల్ మీడియాలో వచ్చే లింక్‌లపై అసలు క్లిక్ చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు సౌనాజ్ సుల్తానా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బట్టీలకూ 'భరోసా'!

5వ పేజీ తరువాయి..

ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నందున వ్యవసాయ విద్యుత్‌ను సైతం వాడేస్తున్నారు. వాస్తవానికి ఇటుకబట్టీలకు కమర్షియల్ విద్యుత్‌ను వినియోగించాలి. భూములకు నాలా కన్వర్షన్ కాకపోవడంతో వాణిజ్యపరమైన విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయడం లేదు. ఒక వేళ చేసినా అది నామ్‌కేవాస్తే అన్నట్లుగానే ఉంటుంది. వినియోగించేదంతా ఉచిత విద్యుత్ మాత్రమేనని చెప్పక్కర్లేదు. దీనివల్ల పంటలు సాగుచేస్తున్న రైతులకు ఒక్కోసారి లో వోల్టేజి సమస్య తలెత్తుతోంది.



సిద్దిపేట శివారులోని ఏర్పాటైన బట్టీలకు వ్యవసాయ భూముల్లో నుంచే విద్యుత్ సరఫరా

కన్నెత్తి చూడని అధికారులు..

అడ్డగోలుగా ఇటుకబట్టీలను నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. రైతుల భూముల్లో నల్లమట్టిని తరలించే పేరిట చెరువు మట్టిని బట్టీలకు తరలిస్తున్నారు. బొగ్గు, వరిపొట్టుతో బట్టీలను మండించకుండా పచ్చని చెట్లను నరికి కలప దుంగలతో నిప్పు రాజేస్తున్నారు. చేసేది వ్యాపారమైతే వ్యవసాయానికి అందాల్సిన ఉచిత విద్యుత్‌ను ఇష్టానికి వినియోగిస్తున్నారు. వీటన్నింటికీ తోడుగా రైతు భరోసా సహాయాన్ని దర్జాగా పొందుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో మాత్రం చలనం కలగడం లేదు.